క్లుప్తంగా

ఎస్‌ఎంసీ ఎన్నికకు నోటిఫికేషన్


ఎంఈఓ వెంకట్రామిరెడ్డి

కోవెలకుంట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల(ఎస్‌ఎంసీ) ఎన్నికకు గురువారం నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు ఎంఈఓ వెంకట్రామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో 26 ప్రాథమికోన్నత, మూడు ప్రాథమికోన్నత, ఏడు ఉన్నత పాఠశాలలున్నాయని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో ఇప్పటి వరకు ఉన్న పేరెంట్స్ కమిటీల గడువు ముగియడంతో ఆ స్థానంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఎన్నుకోవడానికి ఆగస్టు 8వ తేదీ ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. ఎన్నికైన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, మౌలిక సదుపాయాల పర్యవేక్షణ, విద్యాభివృద్ధికి సలహాలు సూచనలు అందజేస్తారని పేర్కొన్నారు.

వేగంగా వంతెన నిర్మాణ పనులు


పూజలు నిర్వహిస్తున్న పెన్నా సిమెంట్ ఏజీఎం

కొలిమిగుండ్ల: కోర్నపల్లె సమీపంలోని గుండం ఆంజనేయస్వామి ఆలయం నుంచి పట్టాభిరామాలయం వరకు నిర్మిస్తున్న వంతెన పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాంక్రీట్‌తో నిర్మించిన పిల్లర్ల పనులు పూర్తి కావడంతో బుధవారం ఐరన్ కమ్మీలతో చేపడుతున్న పనులకు పెన్నా సిమెంట్ ఏజీఎం కళ్యాన్ శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. ఈ మార్గంలో రహదారి సౌకర్యం లేక పోవడంతో రెండు కొండల మధ్య పిల్లర్లు నిర్మించి ఐరన్ కమ్మీలతో వంతెన పనులు చేపడుతున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ పనులు పూర్తయితే భక్తులు రాకపోకలు సాగించేందుకు సులభంగా ఉంటుందని పేర్కొన్నారు.

లారీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సీపీఎం నేతలు

డోన్ టౌన్: లారీ డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచడంలో లారీ యజమానులు మొండి వైఖరి విడనాడి వారి సమస్యలు పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. వేతన ఒప్పందం, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని లారీ కార్మికులు 9 రోజులుగా సమ్మె చేస్తున్నా లారీ యజమానులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అధికారులు చొరవ తీసుకుని కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. నాయకులు ఎస్‌ఏ. చిన్న రహిమాన్, ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి ఆశోక్ ఉన్నారు.

డోన్ డీఎస్పీగా శ్రీనివాసులు



డోన్ టౌన్: డోన్ డీఎస్పీగా పి.శ్రీనివాసులు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నూతన డీఎస్పీ శ్రీనివాసులు 2004 నుంచి 2007 వరకు పట్టణంలో ఎస్‌ఐగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లా సీబీడీ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఈయన డోన్ డీఎస్పీగా బదిలీపై రానున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

ప్యాపిలి: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రిజిస్ట్రేషన్లు జరుగుతున్న తీరును స్థానిక సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం చాలా చిన్నగా ఉండడంతో గదుల కొరత నెలకొందని సబ్‌రిజిస్ట్రార్ జిల్లా అధికారికి వివరించారు. రికార్డులు భద్రపరుచుకోవడం కోసం నూతనంగా రెండు గదుల అవసరం ఉందని తెలిపారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారి హామీ ఇచ్చారు.

నివాళి


నివాళులర్పిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామానికి చెందిన వాటర్ మెన్ ఎల్లయ్య (62) గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గ్రామ సర్పంచ్ చిన్న మద్దమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు ఎద్దులన్న, తిమ్మయ్య బుధవారం ఎల్లయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

డేంజర్ జర్నీ

రెప్పపాటు సమయం నిండు నూరేళ్ల జీవితాన్ని అర్ధాంతరంగా ముగిసేలా చేస్తుంది. వాహన డ్రైవర్ల అత్యాశ, పోలీసు, రవాణాశాఖ అధికారుల అలసత్వం, అవినీతి వల్ల విద్యార్థులు ప్రమాదపు అంచున వాహనాల్లో ప్రయాణం చేస్తున్నారు. డ్రైవర్లు రోడ్డు రవాణా నిబంధనలను తుంగలో తొక్కి పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు తమ బస్సుల్లో ప్రయాణిస్తే తప్ప బాధ్యత వహించమని చేతులెత్తేస్తున్నాయి.

- నిబంధనలు భేఖాతరు
- పరిమితికి మించి విద్యార్థులను ఆటోల్లో తరలిస్తున్న డ్రైవర్లు
- మాకేం సంబంధం లేదంటున్న ప్రైవేటు యజమాన్యాలు
- చిన్నారుల భద్రతపై ఆందోళన


కామగానికుంట్ల నుంచి డోన్‌కు విద్యార్థులతో కిక్కిరిసి వస్తున్న ఆటో

డోన్: మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఆటోలు, ట్యాక్సీల్లో విద్యార్థులు ప్రయాణం చేస్తున్నారు. అయితే వాహన డ్రైవర్లు నిబంధనలను పాటించకుండా విద్యార్థులను పరిమితికి మించి ఆటోల్లో కుక్కి తరలిస్తున్నారు. కొందరు విద్యార్థులు ఒకరి ఒడిలో ఒకరు కూర్చొని.. మరికొందరు డ్రైవర్ సీటు పక్కన, ఇంకొందరు వెనుక భాగాల్లో ప్రమాదకర రీతిలో రాకపోకలు సాగిస్తున్నారు. విద్యార్థులను పాఠశాలలకు తరలించేందుకు ఆటో డ్రైవర్లు నెలకు ఒక్కో విద్యార్థి నుంచి రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు. ఎక్కువ ఆదాయం కోసం విద్యార్థులను పరిమితికి మించి తీసుకెళుతున్నారు. యథేచ్ఛగా రోడ్లపై ఉదయం, సాయంత్రం తిరుగుతున్న ఈ వాహనాలను తనిఖీ చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కొందరు డ్రైవర్లకు లైసెన్సులు, వాహన పత్రాలు కూడా సక్రమంగా లేవనే ఆరోపణలు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల యజమానులు తమ బస్సుల్లో ప్రయాణిస్తే తప్ప బాధ్యత వహించమని స్పష్టం చేస్తున్నారు. పాఠశాల బస్సులు కాదని, ప్రైవేటు వాహనాల్లో పాఠశాలలకు వచ్చే విద్యార్థుల భద్రతపై తమకు ఏ మాత్రం సంబంధం, బాధ్యత లేదని స్పష్టం చేస్తున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు వెళ్లే వాహనాలపై పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది.


వాహనం వెనుక భాగంలో ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్న విద్యార్థి

డోన్ మండలంలో పాఠశాలల వివరాలు	
ప్రభుత్వ పాఠశాలలు	79
విద్యార్థులు	11,349
ప్రైవేట్ పాఠశాలలు	40
విద్యార్థులు	11,110

నిబంధనలు పాటించాల్సిందే



రాష్ట్ర రోడ్డు రవాణా నిబంధనలను ప్రతి ఒక్క వాహన డ్రైవర్ కచ్చితంగా పాటించాలి. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి వాహనాల్లో విద్యార్థులు, ప్రయాణికులను ఎక్కిస్తే జరిమానాలు విధిస్తాం. లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ కచ్చితంగా కలిగి ఉండాలని తరచూ డ్రైవర్లను హెచ్చరిస్తున్నాం. విద్యార్థులను తీసుకెళ్లే వాహన డ్రైవర్లు పరిమిత వేగంతోనే నడపాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తప్పవు.
–క్రాంతి కుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, డోన్


బేతంచెర్ల రోడ్డులో పరిమితికి మించి ప్రయాణిస్తున్న విద్యార్థులు

ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పడేస్తే జరిమానా

- మున్సిపల్ కమిషనర్ జయరాం


అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ జయరాం

డోన్: ఖాళీ స్థలాల్లో చెత్త, వ్యర్థాలు పడేస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం హెచ్చరించారు. బుధవారం స్థానిక 26వ వార్డులో మున్సిపల్ డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషాతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎక్కడపడితే అక్కడ చెత్త పడేయడం వల్ల దుర్గంధంతో పాటు దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణం అవుతాయని తెలిపారు. పట్టణ ప్రజలు స్వచ్ఛ డోన్‌కు సహకరించాలని కోరారు. తాగునీరు వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు సూచించారు. కొందరు డ్రమ్ములు, గచ్చుల్లో నీటిని నిల్వ చేసుకుని చాలా కాలం అలానే ఉంటుకుంటున్నారని.. ఇలా చేయడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బంది ప్రజల నుంచి చెత్త సేకరణ సమయంలో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా తీసుకోవాలని సూచించారు. వర్షా కాలం నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. అవి కూలక ముందే అందులో ఉన్న వారిని ఖాళీ చేయించాలన్నారు.

మెనూ ప్రకారమే భోజనం

- కస్తూర్బా ప్రిన్సిపాల్ అబిదాబేగం

బేతంచెర్ల: ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో భోజనం పెడుతున్నామని ప్రిన్సిపాల్ అబిదాబేగం అన్నారు. మంగళవారం విద్యాలయం దగ్గరకు వచ్చిన ఏఐఎస్‌ఎఫ్ నాయకులను విద్యాశాఖ ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని రావాలని తెలపడంతో తనపై పలు ఆరోపణలు చేశారని తెలిపారు. విద్యార్థులను మానసికంగా ఇబ్బందులు గురిచేస్తున్నానని, మెనూ సక్రమంగా లేదని ఆరోపణలు చేశారన్నారు. ఆడపిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకునే అలా అన్నానని చెప్పారు. ప్రతి రోజు భోజనం తయారు చేసిన తర్వాత ఉన్నతాధికారులకు ఫొటోలు పంపుతామని తెలిపారు. వంట మనుషులకు ఇచ్చిన సరుకులను సక్రమంగా విద్యార్థులకు వండిపెట్టాలని ఆదేశించడంతో వారు విద్యార్థి సంఘాలు, బయటకు వ్యక్తులను రెచ్చగొట్టి తన విధులకు ఆటంకం కలిగిస్తూ ఆసత్య ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

డోన్ టౌన్: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం, పార్కు ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి గుండాల ఈశ్వర మాదిగ డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డిని కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట సమితీ సభ్యులు చిన్న రాముడు, రామాంజనేయులు, ఎల్లయ్య, రామకృష్ణ, చిన్నలక్ష్మన్న తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

బేతంచెర్ల: ప్రభుత్వ స్థలాలను ఎక్కడైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు హెచ్చరించారు. బేతంచెర్ల నగర పంచాయతీలోని శేషారెడ్డి సర్కిల్ సమీపంలో ఉన్న ఎల్పీ నంబర్ 78/91 సర్వే నంబర్ 219లో 288.758 చదరపు గజాల స్థలాన్ని గొల్ల పద్మనాభం యాదవ్ తన భార్య లావణ్య పేరుపై నకిలీ ధ్రువ పత్రాలతో బేతంచెర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నంబర్ 183/2024తో రిజిస్టర్ చేయించుకున్నారని తెలిపారు. ఇది చట్ట రీత్యా నేరం అన్నారు. ఈ స్థలం బేతంచెర్ల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నిషేధిత జాబితాలో చేర్చామని, ఇది ప్రభుత్వ స్థలం అని స్పష్టం చేశారు. ఈ స్థలాన్ని కొనుగోలు చేసినా, విక్రయించినా పురపాలక సంఘం 1965 చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనాథ మహిళకు అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుకుని జీవనం సాగించే ముంతాజ్ (32) అనే మహిళ టీబీ వ్యాధితో మరణించింది. మృతురాలికి ఎవరూ లేకపోవడంతో స్థానికులు ఆమెకు అంత్యక్రియలు నిర్వహించాలని ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వన్నూర్ బాషాను కోరారు. బుధవారం తన సంస్థ సభ్యులతో ముంతాజ్ మృతదేహాన్ని బేతంచెర్ల ముస్లిం శ్మశాన వాటికకు తరలించి ఇస్లాం ఆచారాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. సంస్థ సభ్యులు నాగేశ్వర్ రెడ్డి, లక్ష్మీ రాఘవ, అక్బర్, వెంకటేశ్వర్లు, సద్దాం, యుసఫ్ పాల్గొన్నారు.

డోన్‌లో సీఐల బదిలీ

డోన్ టౌన్: పట్టణ, గ్రామీణ పోలీస్‌స్టేషన్లలో సీఐలుగా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్, అస్రత్‌బాషా బదిలీ అయ్యారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో చేపట్టిన బదిలీల్లో భాగంగా వీరిద్దరిని బదిలీ చేసింది. ప్రవీణ్‌కుమార్‌ను జిల్లా హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేయగా రూరల్ సీఐ అస్రత్‌బాషాను ఎక్కడికి బదిలీ చేశారనే విషయం తెలియాల్సి ఉంది. అయితే పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐగా ఇంకా ఎవరినీ నియమించలేదు. రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సీఐగా నంద్యాల జిల్లా కేంద్రంలో సోషల్ మీడియా, సైబర్ క్రైం విభాగంలో పనిచేస్తున్న సీఎం రాకేష్‌కు పోస్టింగ్ ఇచ్చినట్లు డీజీపీ కార్యాలయం ఆర్డర్ విడుదల చేసింది.

ఈరోజు

ఎస్‌ఆర్‌బీసీ ద్వారా నీటి విడుదల

బనగానపల్లె: ఎస్‌ఆర్‌బీసీ అనుసంధానంగా ఉన్న 13 బ్లాక్‌ల ద్వారా గురువారం నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు ఎస్‌ఆర్‌బీసీ ఈఈ సురేష్‌బాబు తెలిపారు. ఎస్‌ఆర్‌బీసీ పరిధిలో 1.62 లక్షల ఆయకట్టు ఉన్నట్లు పేర్కొన్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ ఏడాది 20 రోజుల ముందుగానే ఆయకట్టుకు నీటిని అందిస్తున్నట్లు ఈఈ చెప్పారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మార్పు పనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మహాలక్ష్మీ హాస్పిటల్, కృష్ణానగర్, పుండరీ నగర్, అయ్యప్పస్వామి గుడి, కురుకుందు కాలనీ, గాంధీనగర్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని.. ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

బనగానపల్లెరూరల్: మండలంలో వివిధ రకాల పింఛన్ లబ్ధిదారులు 12,555 మందికి గురువారం నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. ఇందు కోసం రూ.5.38 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. మొత్తం 204 మంది సచివాలయ ఉద్యోగుల ద్వారా ఉదయం 5.30 గంటల నుంచే పంపిణీ ఉంటుందని తెలిపారు.

తల్లిపాల వారోత్సవాలు

ప్యాపిలి: తల్లి పాల ప్రాముఖ్యతను వివరించేందుకు గురువారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించనున్నట్లు వైద్యాధికారిణి వాణిశ్రీ తెలిపారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీలో బుధవారం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో ఓ వ్యక్తిపై ఐదుగురు వ్యక్తులు దాడి చేశారు. ఏఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన తలారి నరేష్, భార్య తలారి చందన తన గ్రామానికి చెందిన నాగలక్ష్మి ఇంటికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన దూదేకుల హుస్సేనమ్మ, దూదేకుల దస్తగిరి, పవన్‌కళ్యాన్, నర్గీన్, పాపన్న రాళ్లు, కట్టెలతో దాడి చేశారు. అనంతరం తలారి నరేష్‌కు రక్తగాయాలయ్యాయి. బాధితుడి భార్య చందన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగిపై దాడి

సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామానికి చెందిన విద్యుత్ ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి జరిగింది. ఏఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. సంజామల లైన్‌మెన్ మహబూబ్ బాషా, ముదిగేడు లైన్‌మెన్ చంద్రశేఖర్, ముక్కమల్ల జేఎల్‌ఎం వెంకటరమణతో కలిసి నొస్సం గ్రామానికి చెందిన లైన్‌మెన్ ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ సంజీవకుమార్ గ్రామంలో విద్యుత్ బకాయిలను వసూలు చేయడానికి మంగళవారం సాయంత్రం వెళ్లారు. అదే గ్రామానికి చెందిన మద్దూరు పెద్దనరసింహులు, నడిపి సుబ్బరాయుడు ఇంటి దగ్గరకు వెళ్లిన విద్యుద్ సిబ్బందిని బూతులు తిడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ సంజీవకుమార్‌ను చెంపపై కొట్టారు. విద్యుత్ బిల్లులు అడిగితే చంపుతామని బెదిరించారు. సంజామల లైన్‌మెన్ మహబుబ్ బాషా ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

సమాజాభివృద్ధిలో అధ్యాపకుల పాత్ర కీలకం


పీడీ విజయకుమారి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్: సమాజాభివృద్ధిలో అధ్యాపకుల పాత్ర కీలకంగా ఉంటుందని రాయలసీమ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కోఆర్డినేటర్ శివకిశోర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ అధ్యాపకురాలు విజయకుమారి బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా శివకిశోర్ మాట్లాడుతూ.. ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడంతో అధ్యాపకుల పాత్ర ఎంతో ఉందని తెలిపారు. విజయకుమారి అందించిన సేవలను కొనియాడారు. మరో అతిథి రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సమాజ సేవలో పాల్గొనాలని సూచించారు. కళాశాలలో క్రీడల అభివృద్ధి కోసం తన వంతు రూ.లక్ష చెక్కును ప్రిన్సిపాల్‌కు అందజేశారు. అనంతరం విజయకుమారి, రామకృష్ణారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

- ఎమ్మెల్యే జయ సూర్యప్రకాష్‌రెడ్డి
- సాదాసీదాగా నగర పంచాయతీ సమావేశం


మాట్లాడుతున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి

బేతంచెర్ల: సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశానికి మొదటి సారిగా హాజరైన ఎమ్మెల్యే కోట్లను నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, వార్డు కౌన్సిల్ సభ్యులు సత్కరించారు. అనంతరం ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. నగర పంచాయతీ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, విలువైన స్థలాలను కాపాడాలని వార్డు కౌన్సిలర్ అంజి అన్నారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తామని కమిషనర్ తెలిపారు. కొత్త బస్టాండ్ సమీపంలో నగర పంచాయతీకి చెందిన స్థలం ఆక్రమణకు గురైందని కౌన్సిలర్ ఇబ్రహీం అన్నారు. కాలనీల్లో డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని వార్డు కౌన్సిలర్లు ఆదిలక్ష్మి, కుమారి కోరారు. గతంలో నగర పంచాయతీకి రూ. 42 కోట్ల నిధులు మంజూరు కాగా ఇప్పటి వరకు రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, మిగిలిన రూ. 21 కోట్లు నిధులు మంజూరయ్యే విధంగా కృషి చేయాలని నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి ఎమ్మెల్యే కోట్లను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..

పట్టణంలో కుక్కలు, ఆవులు, పందుల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వచ్చే ఏడాది జనవరి నాటికి వాటర్ గ్రిడ్ పథకం కింద గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ప్రతి ఇంటికి తాగునీటిని అందజేస్తామన్నారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్లు నాగ వెంకటేశ్వర్లు, పర్వీన్, వార్డు కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, మధు, కోట్ల మధు, హుసేన్‌బీ, యంగమ్మ, మహేశ్వరి, సుశీలమ్మ, శకుంతల పాల్గొన్నారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

సంజామల: మండల పరిధిలోని కానాల గ్రామానికి చెందిన బాల మద్దిలేటి బుధవారం కోవెలకుంట్ల నుంచి బైక్‌పై ముదిగేడు వెళుతున్నాడు. ముదిగేడు గ్రామ సమీపంలో కోవెలకుంట్ల నుంచి అవుకు వెళుతున్న వినయ్ కారుతో వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మద్దిలేటికి గాయాలయ్యాయి. అతని ఫిర్యాదు మేరకు వినయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

కంప చెట్ల తొలగింపు


కంప చెట్లను తొలగిస్తున్న జేసీబీ

డోన్ టౌన్: రహదారిలో పేరుకుపోయిన ముళ్లచెట్లు, కంపలను పట్టణానికి చెందిన న్యాయవాది, కృష్ణగిరి మండలం బి.బొంతిరాళ్ల సర్పంచ్ రవిమోహన్ తన సొంత నగదుతో బుధవారం తొలగించారు. పట్టణ సమీపంలోని జాతీయ రహదారి నుంచి ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల, అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాలకు వెళ్లే రహదారిపైకి కంపచెట్లు, పిచ్చి మొక్కలు రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించలేదు. రవిమోహన్ జేసీబీ ద్వారా శుభ్రం చేయించి ఉదారత చాటుకున్నారు.

‘ఆదర్శ’ పూర్వ విద్యార్థులు



పాఠశాలలో నిర్మించిన వేదిక వద్ద పూర్వ విద్యార్థులు

సంజామల: చదువుకున్న బడికి ఏదో ఒక రకంగా సహాయ సహకారాలు అందించాలని ప్రతి విద్యార్థి అనుకుంటాడు. అయితే కొందరు బిజీగా ఉండి మిన్నకుండిపోతారు. మరికొందరు చొరవ తీసుకుని అభివృద్ధి చేస్తుంటారు. మండల పరిధిలోని పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (1983–84) బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తమ పాఠశాలకు ఏదో రకంగా అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో పాఠశాలలో రూ.1.50 లక్షలతో వేదిక నిర్మాణం చేశారు. ఆ వేదికను పాఠశాల ప్రధాన ఉపాధ్యానోపాధ్యాయురాలు సీతారావమ్మ బుధవారం ప్రారంభించారు. అనంతరం పూర్వ విద్యార్థులు మాట్లడుతూ.. పూర్వ విద్యార్థులంతా కలిసి వేదికను నిర్మించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి సేవభావం అవర్చుకోవాలన్నారు. పాఠశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామని పేర్కొన్నారు.

రైతు నేస్తాలు



కొంగలు రైతులకు ఎంతో మేలు చేస్తుంటాయి. దున్నుతున్న పొలంలో ఆహారం కోసం అన్వేషిస్తూ క్రిమి, కీటకాలను తింటూ వాటి కడుపు నింపుకోవడమే కాదు.. పంటకు రక్షణగా నిలుస్తుంటాయి. అవుకు లోని ఓ రైతు తన పొలాన్ని దున్నుతుండగా కొంగలు గుంపులుగా ఆ రైతు పొలంలోకి చేరాయి. బుధవారం కనిపించిన ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరాలో బంధించింది. –అవుకు